

రోడ్ల పనులకు ప్రతిపాదనలు పంపాలి

శ్రీకాకుళం : రహదారుల పనులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఐటిడిఎ అధికారులను ఆదేశించారు. ఐటిడిఎ సంక్షేమం, అభివృద్ధి పథకాలపై అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. పాతపట్నం నియోజకవర్గంలో చేపడుతున్న పనులపై ఆరా తీశారు. స్పోర్ట్స్ స్కూల్‌కు సంబంధించి ఎక్కడెక్కడ ఏఏ ఐటమ్స్ పెడతారు, తదితర వివరాలతో డిపిఆర్ పంపాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలకు మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ చెప్పారు. పిహెచ్‌సి, మందులు, తదితర వాటిపై కలెక్టర్‌కు పిఒ వివరించారు. సమావేశంలో ఎపిఒ జి.చినబాబు, డీడీ ఎం.అన్నాదొర, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, డిఇఒ తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గుండె గుబిల్లు



- అమల్లోకి వచ్చిన ఇంధన సర్దుబాటు ఛార్జీలు
- బిల్లులు చూసి షాక్ అవుతున్న వినియోగదారులు
- అన్ని కేటగిరీలపైనా వాత
- ఏడాదికి వినియోగదారులపై రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల భారం

'వైసిపి ప్రభుత్వం అన్ని ధరలను పెంచింది. జనంపై బాదుడే బాదుడు... తాము అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచబోం. అవసరమైతే తగ్గిస్తాం'... ఇవీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా పలాస బహిరంగ సభలో పలికిన పలుకులు. విద్యుత్ ఛార్జీలు తగ్గించడం మాట అటు ఉంచితే, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం పలురకాల పేర్లతో ఛార్జీలను విధించి వినియోగదారుల నడ్డివిరుస్తోంది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిపిసిఎ) పేరుతో ప్రభుత్వం విధించిన ఛార్జీలు ఈనెల నుంచి అమల్లోకి రావడంతో, డిసెంబరులో బిల్లులు చూసి వినియోగదారులు షాక్ అవుతున్నారు. కరెంట్ ఛార్జీల పెంపుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 7,87,601 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 6,69,106 గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లు, 65,647 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 2,398 పరిశ్రమలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వీధిదీపాలు, రక్షిత మంచి నీటి కనెక్షన్లు 20,233 ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన కరెంట్‌పై ప్రజల నుంచి మొదటి విడతగా రూ.6072.86 కోట్లను ఛార్జీల రూపంలో వసూలు చేసేందుకు ఎపి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ డిస్కమ్‌లను అనుమతించిన విషయం తెలిసిందే. దీంతో వినియోగదారుడు ఏడాది కాలంలో వినియోగించిన మొత్తం యూనిట్లను సరాసరి చేసి ప్రతి నెలా వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఆంధ్రప్రదేశ్ ఈస్ట్రన్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎపిఇపిడిసిఎల్) అధికారులు ఈనెల నుంచే అమలు చేయడం ప్రారంభించారు. బిల్లులో ఎఫ్‌పిపిపిసిఎ-2 పేరుతో అదనపు రుసుము విధిస్తున్నారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలో 6072.86 కోట్లు కాగా అందులో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని నాలుగు క్వార్టర్లలో వసూలు చేయనున్నారు. ఈ ఏడాది నవంబరు నుంచి 2026 జనవరి వరకు ఉన్న కాలాన్ని నాలుగు క్వార్టర్లుగా విభజించి విడతల వారీగా ప్రభుత్వం వాత పెట్టేందుకు సిద్ధమైంది. మొదటి క్వార్టర్ కింద ఈ ఏడాది నవంబరులో వాడిన కరెంట్‌కు యూనిట్‌పై 59 పైసలు వసూలు చేస్తోంది. అదే ప్రస్తుతం డిసెంబరు బిల్లులో వస్తోంది. గరిష్ఠంగా యూనిట్‌కు 80 పైసలు వరకు వేసి బిల్లులు జారీ చేయనుంది. ఇప్పటికే వినియోగదారుల నుంచి ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరంలో వాడుకున్న కరెంట్‌కు ఎఫ్‌పిపిపిసిఎ-1 పేరుతో డబ్బులు వసూలు చేస్తోంది. ప్రస్తుతం డిసెంబర్‌లో వస్తున్న బిల్లులు చూసి వినియోదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

వినియోగదారులపై రూ.50 కోట్ల నుంచి 60 కోట్ల భారం

జిల్లాలో మొత్తం 7,87,601 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వినియోగదారుల నుంచి సరాసరిన రూ.వంద కోట్ల వరకు వసూలవుతోంది. గత నెలలో రూ.105.91 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం ఇంధన సర్దుబాటు ఛార్జీలు అమలు కావడంతో, ఐదు నుంచి ఆరు శాతం ఆదాయం శాతం వరకు ఆదాయం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. నెలకు రూ.5 కోట్ల నుంచి రూ.ఆరు కోట్ల వరకు ఆదాయం రానుంది. ఈ లెక్కన ఏడాదికి రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు వస్తుందని అంచనా వేస్తున్నారు.

భారీ బిల్లులతో వ్యాపారుల విలవిల

భారీగా వస్తున్న విద్యుత్ ఛార్జీలతో వ్యాపారులు, ప్రయివేట్ కార్యాలయాలు షాక్‌కు గురవుతున్నారు. జిల్లాలో కేటగిరీ-2 పరిధిలోకి వచ్చే వ్యాపార, వాణిజ్య సంస్థలకు సంబంధించి మొత్తం 65,447 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఎచ్చెర్ల మండలం కుశాలపురం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓ కంపెనీకి గత నెలలో రూ.21,754లు బిల్లు వచ్చింది. ప్రస్తుతం ఎఫ్‌పిపిపిసిఎ-1 అమల్లోకి రావడంతో బిల్లు అమాంతంగా పెరిగి, రూ.25,960తో బిల్లు జారీ అయింది. ఎఫ్‌పిపిపిసిఎ-1 పేరుతో రూ.1315 అదనంగా విధించారు. పళ్ల రసాల దుకణాలు, హోటళ్ల నుంచి షాపింగ్‌మాల్స్ వరకు అన్ని కేటగిరీ దుకాణాలకూ విద్యుత్ బిల్లుల భారం పడింది. విద్యుత్ బిల్లులు పెరుగుతున్న ప్రతిసారీ అల్పాహారం, భోజన రేట్లు పెరుగుతున్న పరిస్థితి నెలకొంది. వీటితోపాటు పిండిమిల్లులు, ధాన్యం మర ఆడించడం వంటి రేట్లు పెరగనున్నాయనే చర్చ నడుస్తోంది. వినియోగిస్తున్న కరెంట్‌కు ప్రత్యక్షంగానూ ఇతర అంశాలపై పరోక్షంగా భారం పడనుందనే ఆందోళన అందరిలోనూ నెలకొంది.

శ్రీకాకుళం నగరం బొందిలీపురం భార్గవినగర్‌లో సర్వీస్ నంబరు 131102 ఎ 202046135తో కరెంట్ వినియోగిస్తున్న ఓ విశ్రాంత ఉద్యోగికి డిసెంబరు నెల బిల్లు చూసి అవాక్కయ్యారు. ఆయనకు రూ.809.71 బిల్లు వచ్చింది. గత నెలలో రూ.560.96 వచ్చింది. అదనంగా రూ.248.75 రావడంపై ఆయన ఒకింత షాక్‌కు గురయ్యారు. బిల్లును ఆసాంతం పరిశీలిస్తే ఎఫ్‌పిపిపిసిఎ-1 పేరుతో అదనంగా వసూలు చేస్తున్నట్లు అర్థమైంది. వీటితోపాటు ఎఫ్‌పిసిపిసిఎ-1, ఇతర ఛార్జీలతో బిల్లులు జారీ చేసినట్లు తెలుసుకున్నారు.

ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస శ్రీహరిపురంలో 131407ఇ064000065 సర్వీసు నంబరుతో కరెంట్ వినియోగిస్తున్న గురుగుబెల్లి లక్ష్మికి డిసెంబర్ బిల్లులో రూ.507.30 రాగా, నవంబరులో రూ.470.64 వచ్చింది. ఆమెకు రూ.40 పెరిగింది. ఎఫ్‌పిపిపిసిఎ-1 పేరుతో అదనంగా రూ.50 రుసుము విధించారు. ప్రభుత్వ సబ్సిడీ రూ.78 పోనూ మిగిలింది బిల్లు జారీ చేశారు.



బొందిలీపురంలో విశ్రాంత ఉద్యోగికి వచ్చిన కరెంటు బిల్లు (ఎడమ వైపు ఈనెల రూ.809.71, కుడి వైపు గత నెల బిల్లు రూ.560.96)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామాల్లో అన్నిరకాల రెవెన్యూ, వ్యక్తిగత భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల ప్రణాళిక, కార్యాచరణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, ఎండోమెంట్, రిజిస్ట్రేషన్, వక్ఫ్ బోర్డ్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 6వ తేదీ నుంచి 2025 జనవరి ఎనిమిదో తేదీ వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ప్రణాళిక ప్రకారం నిర్ణయించిన తేదీలో, నిర్దేశించిన మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సదస్సులు నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ సదస్సు నిర్వహణ అధికార బృందంలో తహశీల్దార్, ఆర్ఐ, విఆర్ఒ, మండల సర్వేయర్, దేవాదాయ శాఖ, వక్ఫ్ బోర్డు, రిజిస్ట్రేషన్, వ్యవసాయ, అటవీశాఖ, పోలీసు అధికారులు, బ్యాంకర్లు హాజరై అన్నిరకాల రెవెన్యూ వ్యక్తిగత భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతారని చెప్పారు. గ్రామస్థాయిలో చర్చకు వచ్చిన సమస్యలను గ్రామ, తర్వాత దశలో మండల, డివిజన్, జిల్లాస్థాయిలోనే పరిష్కారం చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. జిల్లా పరిధిలో పరిష్కారం కాకపోతే రాష్ట్రస్థాయిలో సమీక్షించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల పర్యవేక్షణ కోసం ప్రతి మండలానికి ఒక జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించామన్నారు.

పండగ వాతావరణంలో పేరెంట్స్ మీటింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల (మెగా పేరెంట్ టీచర్) సమావేశాన్ని ఈనెల ఏడో తేదీన పండగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో డిఇఒ ఎస్.తిరుమల చైతన్యతో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పేరెంట్ టీచర్ సమావేశం ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేయడమనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాలల అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి సమగ్ర ప్రగతి పత్రం అందజేస్తామన్నారు. పాఠశాల ప్రొఫైల్, పిల్లల హాజరు, వారి అభిరుచులు, బలాలు, సవాళ్లు, వారికి అవసరమైన సహాయం, లక్ష్యాలు, వారి సంవత్సర పురోగతి, సహ పాఠ్యాంశాల ఫలితాలు, శారీరక వికాసం తదితర వాటిని నమోదు చేయనున్నట్లు చెప్పారు. పాఠశాలలకు విరాళాలు ఇచ్చిన దాతలు, పాఠశాలల అభివృద్ధికి దోహదపడే పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఇందులో భాగస్వామ్యమవుతాయని తెలిపారు. పిల్లల సమస్యలు, అభ్యసనా సామర్థ్యాలు, క్రీడలు, కళలపై ఆసక్తిని ఉపాధ్యాయుల ముందు ఉంచి వారిని మరింతగా ఆయా అంశాల్లో పరిణితి సాధించేలా ప్రోత్సహించవచ్చని చెప్పారు. పాఠశాలలకు స్టార్ గ్రేడింగ్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు అందజేస్తున్న ఆహారాన్ని ఆరోజు పిల్లల తల్లిదండ్రులకు అందజేస్తామన్నారు. కార్యక్రమం పూర్తిస్థాయిలో జయప్రదం కావడానికి ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సుడా చైర్మన్ కొరికాన రవికుమార్

అందరి సహకారంతో 'సుడా' అభివృద్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అందరి సహకారంతో శ్రీకాకుళం నగరాభివృద్ధి సంస్థ (సుడా)ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆ సంస్థ చైర్మన్ కొరికాన రవికుమార్ వెల్లడించారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో సుడా చైర్మన్‌గా ఆయనతో సుడా కార్యదర్శి ఎం.విజయలక్ష్మి గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడాను పారదర్శకంగా తీర్చిదిద్దుతానన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధుల సహాయంతో అభివృద్ధికి పెద్దపీట వేస్తానన్నారు. పాలకొండ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కూటమి ఎమ్మెల్యేల విజయంలో రవికుమార్, భవాని దంపతుల కృషి మరువలేనిదన్నారు. సాధారణ కుటుంబంలో పుట్టిన రవికుమార్ క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగారని, రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేసిన ఆయనకు సుడా చైర్మన్ పదవి దక్కడం అభినందనీయమన్నారు. కష్టపడి పనిచేసిన వారికి జనసేన పార్టీ గుర్తిస్తుందన్నారు.

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో సుడా అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సుడా తరుపున జిల్లాలో లే అవుట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, మార్క్‌ఫెడ్ సభ్యులు ఆనెపు రామకృష్ణ, కళింగ కార్పొరేషన్ సభ్యులు రవి బాబ్జీ, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, డిసిసిబి మాజీ అధ్యక్షులు డోల జగన్, సుడా ఎపిఒ కృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

విస్తృతంగా వాహన తనిఖీలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వాహన తనిఖీలను విస్తృతంగా చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని డే అండ్ నైట్, రామలక్షణ, ఏడు రోడ్లు, అరసవల్లి మిల్లు జంక్షన్‌ను గురువారం పరిశీలించారు. నగరంలోని ట్రాఫిక్ రద్దీ, సమస్యలపై ఆరా తీశారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలకు గల కారణాలను పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న వాహన తనిఖీల సరళిని పరిశీలించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడిపే వారిని, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేని వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై చట్టపరమైన జరిమానాలు విధించాలన్నారు. ప్రమాదాల నివారణ చర్యలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పలు ముఖ్యమైన రికార్డుల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట రూరల్ సిఐ పైడిపు నాయుడు, ట్రాఫిక్ సిఐ నాగరాజు, ఎస్ఐలు హరికృష్ణ, సంతోష్ ఉన్నారు.

జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

- ఆదివాసీల హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - మందస

జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాల పునర్విభజన తర్వాత సీతంపేట ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాలోకి వెళ్లిపోవడంతో, జిల్లాలోనిగిరిజనులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల్లో కనీసం మౌలిక వసతుల్లేవన్నారు. రక్షిత మంచినీటి పథకం, శ్మశానవాటికలు, రోడ్లు, కొండపోడు భూములకు పట్టాలు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గిరిజనులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాల్సి ఉన్నా, బిల్లులు వసూలు చేస్తూ వారిపై అధిక విద్యుత్ ఛార్జీల భారం మోపుతోందని విమర్శించారు. బిల్లులు చెల్లించని వారి మీటర్లను తొలగించడం అన్యాయమన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం అందుబాటులో ఉండడం లేదన్నారు. గిరిజన పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేరని చెప్పారు. అన్ని గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు లేక పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా సాగు చేస్తున్న గిరిజనులకు నేటికీ పట్టాలు ఇవ్వకపోవడంతో భూమికి దూరమవుతున్నారని తెలిపారు. గిరిజనుల భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని గిరిజన పంచాయతీలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి గిరిజన ప్రాంతంగా నోటిఫై చేసి 1/70 చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వినాశకర విధానాలతో ఆదివాసీల హక్కులపై దాడి చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల భూములను అక్రమంగా గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నాయన్నారు. అటవీ సంపదపైనా కార్పొరేట్ కంపెనీల పెత్తనం కొనసాగుతోందని విమర్శించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఆర్.ప్రకాశరావు, ఆర్.దిలీప్ కుమార్, మట్ట ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ఒత్తిడి చేస్తే ఉద్యమం తప్పదు

ప్రజాశక్తి - కవిటి, టెక్కలి

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ప్రభుత్వ విద్యారంగానికి గానీ, ఉపాధ్యాయులకు గానీ చేసింది శూన్యమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీ ప్రకాష్ విమర్శించారు. ఇప్పుడు హడావుడిగా మెగా పేరెంట్స్ మీటింగ్ అంటూ ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడం సరికాదన్నారు. ఒత్తిడి పెంచితే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ కవిటి మండలంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలిస్టిక్ ప్రోగ్రస్ కార్డులు రెండు రోజుల ముందు ఇచ్చి మెడ మీద కత్తి పెట్టేలా వ్యవహరించడం సరికాదన్నారు. దీనికితోడు మెగా పేరెంట్స్ మీటింగ్ అబ్జర్వేషన్ టీమ్స్ అని పాఠశాలకు వెళ్లి ఒత్తిడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా నాడు-నేడులో భాగంగా అనేక పాఠశాలల్లో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. విద్యార్థులకు సకాలంలో ఇవ్వాల్సిన తల్లికి వందనం పథకం కూడా ఇప్పటికీ ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఇవన్నీ వదిలేసి మెగా పేరెంట్స్ మీటింగ్ అంటూ ప్రభుత్వం ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తోందని చెప్పారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులపై ఒత్తిడిని తగ్గించి, పాఠశాలలకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మేలు చేసేలా వ్యవహరించాలన్నారు.

టెక్కలిలో ఎంఆర్‌సి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి డి.తులసీరావు రెడ్డికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలు సరికాదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పడాల గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, గౌరవాధ్యక్షులు ఎం.కుమారస్వామి, నాయకులు విజయకుమార్, ఎన్.కృష్ణారావు, చిన్నవాడు, బాడాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



కవిటి : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



పీర్లోత్సవానికి తరలివచ్చిన యాత్రికులు

పోటెత్తిన పీర్లకొండ యాత్ర

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

హిందువులు, ముస్లిములు కలిసి చేసుకుని మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్లకొండ యాత్రకు యాత్రికులు పోటెత్తారు. ఇచ్ఛాపురం పట్టణంలో ఏటా మార్గశిర మాసంలో నిర్వహించుకునే ఈ యాత్రను గురువారం నిర్వహించారు. పీర్లోత్సవంగా పిలవబడే ఈ యాత్రకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పీర్లకొండ మీద ఉన్న మసీదు (దర్గా)లో పూజలు చేయించేది ముస్లిం పెద్దలు కాగా, పూజా క్రమం పూర్తిగా హిందువుల దేవతలను కొలిచేది కావడం గమనార్హం. కొబ్బరికాయలు, అరటిపళ్లు, అటుకలతో పూజలు చేస్తారు. సిఐ మీసాల చిన్నంనాయడు నేతృత్వాన ఇచ్ఛాపురం పట్టణ ఎస్ఐ చిన్నం నాయడు, సిబ్బందితో కలిసి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి

ప్రజాశక్తి - పలాస

మండలంలోని నీలావతిలో కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు గురువారం మృతి చెందాయి. మాకన్నపల్లికి చెందిన గొర్రెల కాపరులు చిన్న నీలావతిలో ఉన్న తోటల్లో మందలు వేస్తున్నారు. వారనుయ్య అని పిలిచే ప్రాంతంలో గొర్రెల మందతో కొన్ని రాత్రులుగా బస వేసి ఉన్నారు. మాకన్నపల్లికి చెందిన దాసరి ఆదినారాయణ, మద్దిల లచ్చయ్య, సాలిన కామయ్య, మందస మండలం లింబుగాంకు చెందిన కె.గోపాల్‌కు చెందిన గొర్రెల పిల్లలను రక్షణ వలలో ఉంచారు. మిగిలిన పెద్ద గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లారు.

రక్షణ వలను చించి లోపలకు వెళ్లిన కుక్కలు ఒక్కసారిగా వాటిపై దాడి చేశాయి. చిన్న నీలావతికి చెందిన ఒక మహిళ తన ఆవులు, దూడను మేతకు తీసుకువెళ్లగా దూడ కనిపించకపోవడంతో వెతుకుతుండగా, గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేయడాన్ని చూసింది. గొర్రెల కాపరులకు సమాచారం అందించగా, వారు వచ్చేసరికి పిల్లలు మృతి చెందాయి. సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు కాపరులు చెప్తున్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.



మృతి చెందిన గొర్రె పిల్లలు


విద్యార్థులను అభినందిస్తున్న విసి రజని

ఎన్ఎస్ఎస్ కార్యకర్తలకు అభినందనలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

హిమచల్ ప్రదేశకు చెందిన మనాలిలోని అటల్ బిహారీ వాజపాయ్ మౌంటెనిరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో పదిరోజుల పాటు జరిగిన ఎన్ఎస్ఎస్ జాతీయ సాహస శిబిరంలో పాల్గొని ఉత్తమ చురుకైన యూనిట్‌గా ఎంపికైన డా.బిఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థుల బృందానికి, ఉత్తమ పిఒగా గుర్తింపు పొందిన డా.కె.కరుణానిధికి వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని గురువారం అభినందించారు. డా. బిఆర్ఎయు నుంచి ఎనిమిది మంది, సూర్య తేజ డిగ్రీ కళాశాల (పలాస)కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్. కో-ఆర్డినేటర్ డా.డి.వనజ ఆధ్వర్యంలో ఈ బృంద సభ్యులు విసిని కలిసి తమ సాహస శిబిరం విశేషాలు తెలియజేశారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ఖ్యాతిని, డా.బిఆర్ఎయు ప్రతిభను జాతీయ స్థాయిలో చాటి చెప్పాలని విసి సూచించారు.


బ్యాటరీ సైకిల్‌ను వితరణగా అందజేస్తున్న ఎంపిటిసి ఆదిలక్ష్మి

వికలాంగులకు అండ

ప్రజాశక్తి- పోలాకి

సమాజంలో వికలాంగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారి కష్టాలను తీర్చేందుకు కృషి చేస్తామని గాతలవలస మాజీ ఎంపిటిసి మెండ ఆదిలక్ష్మి అన్నారు. గురువారం వైబివలసలో తన స్వగృహంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని పిరువాడకు చెందిన వికలాంగుడు దినేష్‌కు బ్యాటరీ సైకిల్ వితరణగా అందజేశారు. గతంలో కూడా నలుగురికి సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మెండ శ్రీనివాసరావు, ఎంపిటిసి యాగాటి లక్ష్మణరావు, పిరువాడ మాజీ సర్పంచ్ దంత సింహాచలం, కార్యదర్శి రాంబాబు, కోల్ల కోదండరావు, యారబాటి యర్రంనాయుడు పాల్గొన్నారు.

సూర్యఘర్ యోజనతో ప్రయోజనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేయడం వల్ల దేశం శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయ పడుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రాగోలులో గురువారం ప్రధానమంత్రి సూర్యఘర్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది దేశంలోని చాలా ప్రాంతాల్లో సంవత్సరంలో 6-8 నెలల పాటు లభించే సూర్యరశ్మిని గరిష్టంగా ఉపయోగించుకుంటుందని చెప్పారు. ఈ పథకం మరింత అభివృద్ధి చెందాలన్నారు. భవిష్యత్‌లో సౌరశక్తి ఉపయోగించుకొని అనేక కార్యక్రమాలను నిర్వహించు కోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మోజో స్కాలర్‌షిప్‌కు విద్యార్థి ఎంపిక

వజ్రపుకొత్తూరు: మోజో స్కాలర్‌షిప్‌కు పాఠశాల విద్యార్థి అనకాపల్లి అరవింద్ ఎంపికైనట్లు గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.హరిబాబు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మెరుగైన ప్రతిభ కనబర్చడానికి ఉపకార వేతనాలు ఉపయోగపడతాయన్నారు. అక్టోబర్ 20న www. Mojo class. in online లో నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్‌లో పాఠశాల నుంచి అరవింద్ ఎంపికవ్వడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఒఎన్‌జిసి సౌజన్యంతో మోజో సంస్థ రూ. 15 వేలు చెక్ రూపంలో ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.లక్ష్మణరావు, చింత ఉమారావు, సీతమ్మ, సత్యరాజు, రషీద్, రాజశేఖర్, నాగరాజు, ఉమా మహేశ్వరీ, పార్థసారథి, ధర్మారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ అప్పలస్వామి

నాణ్యతకు లోబడి ధాన్యం కొనుగోలు

సోంపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు ప్రారంభించాలని తహశీల్దార్ అప్పలస్వామి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో గురువారం సమీక్ష నిర్వహించారు. 17 శాతం తేమ ఉంటే కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. అలాగే కొనుగోలు విధి, విధానాలను ఎఒ నరసింహమూర్తి, డిటి కూర్మారావు వివరించారు. హరి నాథరావు, నారాయణరావు, రాజేష్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటరావు

రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు పూర్తి

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6 నుంచి ప్రతి గ్రామంలో రెవెన్యు సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సులపై రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. సంబంధిత శాఖలకు చెందిన అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి, గ్రామస్థాయి వినతులను స్వీకరించి ఫిర్యాదుల పరిష్కార పోర్టల్‌లో అర్‌టిజిఎస్ రూపొందించిన ప్రత్యేక విండోలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరి, డిటి సంతోష కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


కంచిలి : వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

ప్రజాశక్తి- మందస

మండలం బుడార్సింగి పంచాయతీ సచివాలయంలో ఆదివాసీల సమస్యలపై గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.గురునాథ్ గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జరిపిన సమగ్ర సర్వేలో భాగంగా బుడార్సింగి పంచాయతీలో గల గ్రామాల్లో అనేక సమస్యలు

గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గురునాథ్

వెలుగు చూశాయన్నారు. ఒకటి, రెండు గ్రామాల్లో తప్ప అన్ని గ్రామాల్లో మంచి నీటి సౌకర్యం లేదని, పద్మాపురం, సవరపద్మాపురం తదితర గ్రామాల్లో ఒక వీధికి రోడ్డు ఉంటే ఇంకోవీధికి రోడ్డు లేదన్నారు. అర్హులున్నా పింఛన్లు కొంత మందికి ఇవ్వలేదని, ప్రతి గ్రామంలో సామాజిక భవనాలు లేవని, పెడంగోలో ప్రాథమిక పాఠశాలలో వర్షం పడితే శ్లాబు లీకై వర్షం నీరు కారుతోందన్నారు.

మరికొన్ని గ్రామాల్లో అంగన్వాడీ భవనాలు లేవని, తాతల కాలం నుంచి భూములు గిరిజనుల చేతుల్లో ఉన్నా వాటికి హక్కు పత్రాలు లేవని, దీనిని ఆసరా చేసుకొని గిరిజన భూములు గిరిజనేతరులు ఆక్రమణలు చేస్తున్నారన్నారు. దానిని ప్రశ్నించిన గిరిజనులపై దాడులు చేస్తున్నారని, మౌలిక వసతులు కూడా లేని గ్రామాల్లో అణగారిన తరగతిగా జీవిస్తున్న గిరిజనులను ఆక్రమణ దారులు వంచించడం నేరమని, ప్రభుత్వాలు చూసి చూడనట్లు ఉండడం


మందస : వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజనుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టేలా తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఎస్.ధర్మారావు, శుభాష్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కంచిలి: నువగడ పంచాయతీ గిరిజనుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ గిరిజన ఆదివాసి సంఘ ప్రతినిధులు జలంత్రకోట సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, ఉపాధి జాబ్ కార్డులు అందించాలని, గిరిజన గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సవర జయరాం, కె.మోహనరావు, నరసింహులు, కప్ప గోపి పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం


పలాస : వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ మోహనరావు, సిబ్బంది

ప్రజాశక్తి- పలాస

గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నేరమని దీనిపై విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహిస్తామని కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు అన్నారు. గురువారం పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో వాహనాలను ప్రత్యేక పోలీసుల సహాయంతో తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు నెంబరు ప్లేట్లు, ఆర్‌సి బుక్‌లను తనిఖీ చేశారు. అనంతరం అనుమానిత వాహనాల డిక్కీలను ఓపెన్ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఒడిశా అనుసంధానంగా రహదారులు ఉన్న కారణంగా గంజాయి అక్రమ రవాణాకు ఆస్కారం ఏర్పడుతుందని, దీనిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అనుమానిత వాహనాలతో పాటు ఒడిశా నుంచి వచ్చే వాహనాలపై దృష్టి సారించామన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు, గొప్పిలి రహదారి, టెక్కలిపట్నం రోడ్లు కూడలిలో ప్రత్యేక సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూసే బాధ్యత వారి తల్లిదండ్రులదేనని, ఎక్కువగా గంజాయి అక్రమ రవాణాతో పాటు స్పీడ్ డ్రైవింగ్ చేస్తున్నది యువతేనన్నారు.

రికార్డులు లేని వాహనాలు సీజ్

లావేరు: వాహనదారులు రికార్డులు లేకుండా ప్రయాణిస్తే అటువంటి వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ లక్ష్మణరావు హెచ్చరించారు. జాతీయ రహదారి సుభద్రాపురం కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈయనతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.


లావేరు : వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

కొత్తూరు: మండల కేంద్రమైన కొత్తూరులో స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా సుమారు 60 వాహనాలు తనిఖీ చేయగా ఎటువంటి పత్రాలు లేని మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన బలగ డిఎల్‌టిసిలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా నాలుగు నెలల పాటు శిక్షణా కోర్సు నిర్వహిస్తున్నట్లు ఎడి వై.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పైబడి విద్యార్హత గల 18 నుంచి 27 మధ్య వయసు యువతీ, యువకులు ఈశిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్ఎస్‌సి, ఆధార్, ఇంటర్ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో పాటు రెండు ఫోటోలతో డిఎల్‌టిసిలో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7095731303 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

శిరీష పరామర్శ

పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 26వ వార్డుకు చెందిన వ్యాపారవేత్త, టిడిపి సీనియర్ నాయకులు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శాసనపురి మురళీ కృష్ణ సోదరుడు శాసనపురి శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుడు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నందిగాం: మండలంలోని మదనాపురం సబ్‌స్టేషన్ పరిధిలో గల దిమ్మిడిజాల, దీనబంధపురం, హర్షబాడ, కల్లాడ, మదనా పురం, బైరిబడ్డపాడు, రతజన బొడ్డపాడు తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జంగిల్ క్లియరెన్స్, నిర్వహణ కొరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని, ఆయా గ్రామాల ప్రజలు గమనించాలని ఇఇ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

నైపుణ్యం కీలకం

టెక్కలి: విద్యార్థులు చదువుకునే వయసులోనే తమ విద్యాభివృద్ధిలో భాగంగా పరిశ్రమల ఏర్పాటు వాటి నిర్వహణ వంటి అంశాలపై నైపుణ్యం అవసరమని టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రోనంకి శ్రీనివాసరావు సూచించారు. పాఠశాలకు చెందిన తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు గురువారం ఈశ్వరరావు ఎలక్ట్రానిక్స్, రాడ్ల తయారీ పరిశ్రమని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తయారీలో వినియోగిస్తున్న ముడి సరుకు, వాటి నిర్మాణం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వాలు స్వయం ఉపాధి కల్పన దిశగా చేస్తున్న ప్రయత్నాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రామిరెడ్డి, సూర్యనారాయణ, రవికిరణ్ పాల్గొన్నారు.

9న జాతీయ అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల : ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 9న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నామని, ఈ అప్రంటిస్ మేళాకు జిల్లాలోని ఏడు ప్రముఖ కంపెనీలు ఖాళీలను భర్తీ చేసేందుకు హాజరవుతాయని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎల్.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే అప్రంటిస్ మేళాకు జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలో వివిధ ట్రేడ్‌ల్లో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు మూడు బయెడేటాలతో పాటు ఐటిఐ, ఆధార్, పదవ తరగతి సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, మూడు కలర్ ఫోటోలతో హాజరు కావాలన్నారు.

సభకు తరలిరావాలి

నందిగాం: ఈనెల 8వ తేదీ ఆదివారం విశాఖపట్నంలో గల గురజాడ కళాక్షేత్రలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకముగా జరుగు సభకు మాలలంతా తరలిరావాలని ఆ సంఘ మండల ప్రతినిధి సురేష్ ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు జీవీ హర్ష కుమార్ మల్లెల వెంకటరావు హాజరవుతారని కనుక అందరూ హాజరై సభను జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

రహదారి పనులకు శంకుస్థాపన

కొత్తూరు: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గురువారం సిసి రహదారికి వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీ వర ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వం గ్రామాలను నిర్వీర్యం చేసిందని, అటువంటి సమస్య కూటమి ప్రభుత్వంలో ఉండదన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తాతబాబు, కోయిలాపు సంజీవరావు, చీకటి వీర్రాజు, ముగితి నారాయణరావు, వాడవలస చంద్రరావు, వెంకట్రావు, పొత్రకుండ భీమరాజు, యుగం, చీకటి రవి పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపిపి తులసీవరప్రసాదరావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుజాత

సాంకేతికతతో అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్ఐ రూర్కెలా సౌజన్యంతో రెండు రోజుల పాటు 'ఇన్నోవేటివ్ ప్రొడెక్ట్ డిజైన్ అండ్ ఇంటిలిజెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ సిస్టమ్స్' (ఐసిఐపిడిఐఎంఎస్) అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఈ ముగింపు సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. సుజాత మాట్లాడుతూ నూతన సాంకేతిక జ్ఞానం అభివృద్ధి చెందుటకు ఇటువంటి సదస్సులు దోహద పడతాయన్నారు. మానవ మేథస్సు వృద్ధి చెందడం ఆనందదాయకమైనా, మానవత్వం లోపిస్తే సమాజానికి నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా రోబోకు, మానవునికి ఉన్న తేడాను వివరించారు. సదస్సు కన్వీనర్ సిఎస్ఇ హెచ్ఐడి డాక్టర్ వై.రమేష్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా 156 మంచి ఆలోచనలు వచ్చాయని వాటిలో అత్యంత నాణ్యతా ప్రమాణాలు కలిగిన 50 పేపర్లను గుర్తించామన్నారు. ఈ సదస్సులో డీన్లు డాక్టర్ బి.వి.రమణ, డాక్టర్ సిహెచ్ రమేష్, డాక్టర్ డి.శ్రీరాములు, డాక్టర్ యు.డి.ప్రసన్నలు సదస్సు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సదస్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.జయంతిరావు, హెచ్ఐడిలు పాల్గొని సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికేట్లను అందజేశారు.

రైల్వే కార్మిక సంఘ ఎన్నికల కోలాహలం

భారీ బందోబస్తు మధ్య ఎన్నికలు

పలాస: యూనియన్ల గుర్తింపు కోసం కార్మిక సంఘ ఎన్నికలు కోలాహలంగా జరుగుతున్నాయి. గురువారం రెండో రోజు ఎన్నికలు పలాస రైల్వే స్టేషన్‌లో నిర్వహిస్తున్నారు. పలాస బ్రాంచ్‌కు సంబంధించి పలాస, మందస, సోంపేట, జాడుపూడి రైల్వే స్టేషన్ల పరిధిలో మొత్తం 671 మంది కార్మికులు ఉన్నారు. వీరంతా ఓటుహక్కు వినియోగించుకుంటారు. మొత్తం మూడు రోజుల పాటు ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. శుక్రవారంతో ఎన్నికలకు ఆఖరిరోజు. రన్నింగ్ స్టాఫ్ కోసం ఈ ఎన్నికలు మూడు రోజులు నిర్వహిస్తున్నారు. స్థానిక బ్రాంచ్‌లో శ్రామిక కాంగ్రెస్, శ్రామిక యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్లు తలపడుతున్నాయి. ముఖ్యంగా మొదటి, రెండు యూనియన్ల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. విశాఖపట్నం, సంబల్పూర్, ఖుర్దారోడ్ డివిజన్లుకు సంబంధించి జోన్ల వారిగా ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. శ్రామిక కాంగ్రెస్ నుంచి రమేష్‌పంద్ర సాహు, శ్రామిక్ యూనియన్ నుంచి పికె.పట్నాని బరిలో ఉన్నారు.


ఓటు వేస్తున్న కార్మికులు

వన్య మృగం పాదముద్రలతో హడలిపోతున్న ప్రజలు


హైనా అడుగులు పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు, గ్రామస్తులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలం చినవంక- బాతుపురం గ్రామాల మధ్య ఒంటి మర్రిచెట్టు వద్ద గురువారం వింతజంతువు అడుగులు కనిపించడంతో పులి తిరుతుందని ప్రచారంతో ఉద్దానవాసులు హడిలిపోతున్నారు. గత కొన్ని రోజులుగా జిల్లాలో పెద్దపులి సంచారం నేపథ్యంలో జంతువు అడుగులు పెద్దవిగా కనిపించిగా పులి ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం ఒక్కసారిగా పెరుగుపోతుండడంతో తీర ప్రాంతంలో ప్రతిరోజు బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా బయటకు వెళ్లేందకు బయపడుతున్నారు. గురువారం కూడా వింత జంతువు అడుగులు కనిపించడంతో అడుగులు చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. విషయం తెలుసుకొన్న అటవిశాఖాధికారులు జంతువు అడుగులు పరిశీలన చేయగా ఇవి హైనా (గొడ్డవా) జంతువు అడుగులుగా అటవీశాఖాధికారి పోలయ్య పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పులి సంచారం లేదని, ఎవ్వరు ఆందోళన చెడ్డవద్దన్నారు. ఈ జంతువులు ఆవులు, దూడలపై దాడులు చేస్తాయని రైతులు పశువులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని చెప్పారు.

ఎన్‌జిఒ నేతల సంతాపం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం గ్రామానికి చెందిన ముద్దాడ రాంబుజ్జి మృతిపై ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం గురువారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు. అందరికీ తలలో నాలుకలా వ్యవహరించిన రాంబుజ్జి ఈ రోజు రిమ్స్ ఆసుపత్రిలో మరణించారన్న వార్త ఆవేదన కలిగించిందన్నారు. ఎన్‌జిఒ అసోసియేషన్ కార్యక్రమాల్లో రాంబుజ్జి నిరంతరం మమైకమయ్యేవారని, ఆయన లోటు తీరనిదని అని వారు పేర్కొన్నారు.. రాంబుజ్జి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి- కవిటి

శ్రీకాకుళం జిల్లా పార్టీ ముఖ్య నాయకులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలతో వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గం నాయకులతో ముచ్చటించిన సందర్భంగా కవిటి ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ఉత్సాహంతో పనిచేసి నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అలాగే పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో తొందర్లోనే శుభవార్త వింటామని ప్రకాష్ అభిమా నులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పలాస: తాడేపల్లి నివాసంలో మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, వైసిపి కౌన్సిలర్ ప్రతినిధి, వైసిపి నాయకులు శిష్ట గోపి మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో ప్రజలకు అండగా నిలబడి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని దిశా నిర్దేశం చేశారు.

ఆమదాలవలస: తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ సిఎం, వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని


కవిటి : జగన్‌తో ముచ్చటిస్తున్న ప్రకాష్

నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ నియోజకవర్గ మండల నాయకులతో కలిపి ఆయనను కలిశారు. సమస్యలపై పోరాడుతూ ప్రజల పక్షాన నిలబ డుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డిని కలిసిన వారిలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కిల్లి సత్యనారాయణ, జెడ్‌పిటిసిలు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, బెజ్జిపురపు రామారావు, బూర్జ, సరుబుజ్జిలి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, ఆమదాలవలస మండల పార్టీ అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పప్పల రమేష్ తదితరులు ఉన్నారు.

క్రైమ్ కార్నర్


మృతి చెందిన మనీషా, సాయి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చిన్న హంస సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మురికింటి భద్ర గ్రామానికి చెందిన ముగుడ మనీషా, చామంతి, శిరీష మందస గ్రామానికి చెందిన వ్యక్తి దట్టి సాయి నలుగురు వ్యక్తులు ఒకే ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ చిన్నహంస సమీపంలో ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడ్డారు. ఇందులో మందస గ్రామానికి చెందిన దట్టి సాయి (20), మురికింటి భద్ర గ్రామానికి చెందిన ముగుడ మనీషా (13) ఇద్దరు తీవ్ర గాయాలకు గురై సంఘటన స్థలంలోనే మృతి చెందగా గాయపడ్డ చామంతి, శిరీషకు టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మనీషాకు తల్లిదండ్రులు చల్లయ్య, చామంతి, అన్నయ్య జగదీష్ ఉన్నారు. ప్రమాద సంఘటన స్థలాన్ని సిఐ రామారావు, ఎస్ఐ రమేష్ బాబు సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మందస మురికింటి భద్ర గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


గుర్తుతెలియని మృతదేహం

టెక్కలి పేదల పంచాయతీ తెంబూరు రోడ్డులో జిల్లా ఆస్పత్రి గేటు ఎదురుగా రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ రాము తెలిపారు. ఈ మృతదేహం పోస్టుమార్టం గదిలో రెండు రోజులు భద్రపర్చి ఉంచడం జరుగుతుందని, వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో రాంబుజ్జి మృతి

ఆమదాలవలస : నియోజకవర్గంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ముద్దాడ రాంబుజ్జి (46) అనారోగ్యంతో మృతి చెందారు. ఎచ్చెర్ల మండలం ఎస్ఎం.పురం గ్రామానికి చెందిన రాంబుజ్జి ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్య అనుచరుడుగా గుర్తింపు పొందారు. ఈయన 2024 అసెంబ్లీ ఎన్నికల్లో శాసనసభకు స్వతంత్ర అభ్యర్థి పోటీలో నిలబడగా ఎన్నికల సంఘం ఈయనకు విద్యుత్ స్తంభం గుర్తును కేటాయించింది. గత కొంతకాలం నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఈయన గురువారం మృతి చెందారు. రాంబుజ్జి మరణ వార్త తెలిసిన ఎమ్మెల్యే రవికుమార్‌తో పాటు టిడిపి నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పార్టీ కార్యాలయంలో రాంబుజ్జి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

పుస్తెలతాడు చోరీ

కోటబొమ్మాళి: మండలం నారాయణవలస సంత సమీపంలో గురువారం సాయంత్రం నారాయణ వలసకు చెందిన రావాడ అప్పలమ్మ మెడలో ఉన్న పుస్తెలతాడు (సుమారు 2 తులాలు) అపహరణకు గురైంది. అప్పలమ్మ నారాయణవలస సంతకు ఇంటికి సరుకులు కొనుగోలు చేయటానికి వెళ్ళి తిరిగి వస్తుండగా నారాయణవలస సివిల్ సప్లై గొడౌన్ల వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి తన మెడలోఉన్న పుస్తెలతాడు తెంపుకొని పరారయ్యాని, తాను కేకలు పెట్టినప్పటికీ వేగంగా వెళ్ళిపోయారని అప్పలమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు స్థానిక ఎస్ఐ వి.సత్యన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి సమీపాన ఉన్న దేవీధి వద్ద బుధవారం రాత్రి పలాస నుంచి పర్లాకిమిడి వస్తున్న బస్సు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొనడంతో మెళియాపుట్టి మండలం కోసమాలకు చెందిన గుట్టిపల్లి శామ్యూల్ (63) అక్కడి కక్కడే మరణించాడు. మరొక వ్యక్తికి తీవ్ర గాయలు కాగా పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి తరలించారు.


సచివాలయ సిబ్బందిని విచారిస్తున్న ఎంపిడిఒ

విఆర్ఒపై దాడి ఘటనపై కేసు నమోదు

పొందూరు: మండలంలోని తోలాపి విఆర్ఒ దేవాకరరావుపై దాడిసంఘటనకు సంబంధించి బుధవారం స్థానిక పోలీసులకు గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తోలాపి ఎంపిటిసి భర్త పప్పల రామి నాయుడు ఈనెల 4న మద్యం మత్తులో సచివాల యంలో కంప్యూటర్, ఇతర పరికరాలు ధ్వంసంచేసి విధులు నిర్వహిస్తున్న విఆర్ఒపై దాడిచేసిన సంఘటన పాఠకులకు తెలిసిందే. ఈ సంఘటనపై కలెక్టర్ తక్షణమే ఫిర్యాదు చేయాలని ఎంపిడిఒ, తహశీల్దార్‌కు ఆదేశించిన మేరకు విఆర్ఒల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇచ్చిన ఫిర్యాదుకు స్థానిక పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

దాడి ఘటనపై ఎంపిడిఒ విచారణ

మండలంలోని తోలాపి సచివాలయంలో విఆర్ఒ పై జరిగిన దాడి ఘటనపై ఎంపిడిఒ మీసాల మన్మథ రావు గురువారం విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపిడిఒ సచివా లయ సిబ్బంది, గ్రామస్తులతో వేర్వేరుగా విచారణ చేపట్టారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

పాత తహశీల్దార్ కార్యాలయంలో విధులు

పొందూరు: పొందూరులో గల సచివాలయం- 2, 3 కార్యాలయాలను పాత తహశీల్దార్ కార్యాలయంలోకి తరలించినట్లు గురువారం సర్పంచ్ రేగడి లక్ష్మి, ఇఒ కె.మోహన్‌బాబు తెలిపారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో ఈ సచివాలయాలను నిర్వహిస్తున్నామని, శుక్రవారం నుంచి పాత తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ ప్రజలు గ్రహించాలని వారు కోరారు.

నేల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- సోంపేట

నేలను సంరక్షించుకోవడం మనందరి బాధ్యతన్ని మండల ఎఒ నరసింహమూర్తి అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని పొత్రకొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నేలల సంరక్షణపై విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అప్పలస్వామితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: నేల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని మండల ఎఒ దానకర్ణుడు రైతులను కోరారు. మండలంలోని ఇల్లయపురంలో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. రైతులు నేల సంరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. నేల సారవంతంగా ఉంచాలని కోరారు. సర్పంచ్ జనార్ధనరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రకాష్, షణ్ముఖరావు, రైతులు పాల్గొన్నారు.



సోంపేట : అవగాహన కల్పిస్తున్న ఎఒ నరసింహమూర్తి

పాతపట్నం: మండలంలోని శోభ పంచాయతీ కొమ్మలగూడలో కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ నాగరాజు, ఏరియా సిసి జగన్, ఆదివాసీ రైతులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలిలోని దేవాదాయశాఖ పరిధిలోని శ్రీ సంతోషిమాత ఆలయ హుండీ లెక్కింపు గురువారం అధికారుల సమక్షంలో నిర్వహించారు. 122 రోజులకుగాను హుండీ ఆదాయం రూ.23, 317 వచ్చినట్లు ఆలయ ఇఒ టి.పి.మనస్వి తెలిపారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయ ఇఒ వాకచర్ల రాధాకృష్ణ పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

నందిగాం: మండలంలోని బజారు వీధిలో గల కొత్తమ్మ తల్లి డాక్టర్స్ ప్లాజా వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు శ్రీలక్ష్మి, ఝాన్సీ వైద్యసేవలు అందించారు.

డ్రగ్స్‌తో భవిష్యత్ నాశనం

పొందూరు: డ్రగ్స్ వినియోగించినా, తరలించినా చర్యలు తప్పవని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సంకల్పం కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలు వినియోగించి తమ బంగారు భవిష్యత్‌ను విచ్ఛన్నం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రుల మీపై పెట్టుకున్న ఆశలను ఆడిఆశలు చేయకుండా ఉన్నతంగా చదువుకుని కుటుంబానికి, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. విద్యతోనే ఉజ్మల భవిష్యత్ ఉంటుందని, దీనిని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ర్యాగింగ్, మహిళలను వేధించడం వంటివి చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశానికి హాజరు కావాలి

లావేరు: ప్రభుత్వ పాఠశాలల్లో తల్లితండ్రులతో సమావేశం నిర్వహించాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు 7న ఉదయం 9.30 గంటలకు జెడ్‌పి పాఠాశాల ఆవరణలో తల్లిదండ్రుల సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాలని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మీసాల శ్రీనువాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల విద్యా వికాసంతో పాటు వివిధ సమస్యలు, వారి అభివృద్ధిపై ఉపాధ్యాయులతో సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్రాయిపేట ప్రభుత్వ పాఠశాలకు ఎస్ఎంసి చైర్మన్ మద్దిల రాజేష్ ఫర్నిచర్‌ను వితరణగా అందించారు. సుమారు రూ.4వేలు విలువచేసే ఆఫీస్ టేబుల్‌తో పాటు ప్లాస్టిక్ కుర్చీలను అందించారు. హెచ్‌ఎం ప్రశాంత్ మాట్లాడుతూ మనబడి అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని కోరారు.

ఎయిర్‌పోర్టు పేరుతో దోపిడీ ఆపాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- మందస

మండలం మీల గంగువాడలో గురువారం తీర ప్రాంత భూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కొమర వాసు అధ్యక్షతన సిపిఐ (ఎమ్ఎల్) న్యూ డెమొక్రసి జిల్లా కమిటీ సభ్యులు వంకల మాధవరావు, ఐఎఫ్‌టియు సభ్యులు జుత్తు వీరస్వామి ఎయిర్‌పోర్ట్ భూ బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉద్యానవనం లాంటి ఉద్దానంలో రైతుల ప్రమేయం లేకుండా అధికారులు వచ్చి ఎయిర్‌పోర్ట్ పేరుతో సర్వేలు చేయడం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ప్రభుత్వం పున్ణపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించి గ్రామాల్లోని రైతులతో ఇంటింటికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, పొట్టి ఎర్రయ్య, దున్న రామారావు, గుంటు లోకనాధం, దున్న సురేష్, చిత్త గున్నయ్య, మైలపల్లి శేఖరం, రత్నాల చలపతి, దున్న చంటి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై రబీ విత్తనాలు

ప్రజాశక్తి- కవిటి

స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు టిడిపి నాయకుల చేతులమీదుగా గురువారం రాయితీపై రబీ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రైతులు వినియోగించుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి బడగల దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ రాగి విత్తనాల్లో వేగవతి రకాన్ని రెండు కేజీల ధర రూ.145 ఉంటే రాయితీపై రూ.72కు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిబిజి -1 రకం మినుము విత్తనాలు నాలుగు కేజీలు రూ.360కు



విత్తనాలను అందజేస్తున్న నాయకులు

అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు తమతమ పరిధిలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బెందాలం శ్రీ కళ్యాణ్, వ్యవసాయ సహాయకులు సమన్వయ, మాజీ సర్పంచ్ ఆరింగి మధు పాల్గొన్నారు.

రఘువర్మ పర్యటన



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి- రణస్థలం

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. గురువారం మండలంలో అర్జునవలస, పైడిభీమవరం, రణస్థలం, కోస్ట, పాతర్లపల్లి, కోటపాలెం, లంకపేట తదితర హైస్కూల్లో ఆయన పర్యటించారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘువర్మతో పాటు రణస్థలం మండలం ఉపాధ్యాయ ప్రతినిధులు బి.రమణయ్య, బాలి రామునాయుడు, పున్నాన నరసింహులు నాయుడు, మన్నె కృష్ణానందం, రెడ్డి శ్రీనివాస్, బొంతు అప్పలనాయుడు, సిహెచ్ కోటేశ్వరరావు, డి.రాజశేఖర్, బాలు పాల్గొన్నారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని, అందుకే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ గౌరీశంకర్ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7న జరిగే ఆత్మీయ సమావేశంలో తల్లిదండ్రులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య మంచి సత్సంబంధాలు కలుగుతాయన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులందరికీ హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆరోగ్య శిబిరం కూడా నిర్వహించి విద్యార్థులకు హెల్త్ కార్డులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు, తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎంపిడిఒ చంద్రకుమారి, ఎంఇఒ గోవిందరావు, పాతపట్నం నోడల్ అధికారి నాయుడు, డైట్ కాలేజ్ లెక్చరర్ లీలామోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని వెంకటాపురం, గోవిందపురం గ్రామపంచాయతీ కార్యాలయాలను, పాఠశాలలను ఎంపిడిఒ పి.వెంకటరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, హెచ్‌ఎం, సిబ్బందికి పేరెంట్ టీచర్స్ సమావేశంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పలాస: డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ జరగనుందని ఇన్‌ఛార్జి డిప్యూటీ ఇఒ పి.విలీయం అన్నారు. మండల డిప్యూటీ ఇఒ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కార్యక్రమానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతీ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిఎంఒ పేరాడ ప్రభాకరరావు, ఎఎల్ఎస్‌సిఒ ఎ.గోవిందరావు, ఎంఇఒలు సిహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం : ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి

మహేంద్ర ఫైనాన్స్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని మహేంద్ర ఫైనాన్స్ సంస్థ కార్యాలయంలో గురువారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుతో పాటు మహేంద్ర సంస్థ మేనేజర్ ఎ.బాలకృష్ణ హాజరై ప్రారంభించారు. 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రక్త నిల్వల కొరత రోజురోజుకూ తీవ్రమవుతోందని, కొన్ని అరుదైన గ్రూపు రక్తం దొరకని పరిస్థితి ఉందన్నారు. శిబిరాలు ఏర్పాటుతో రక్తం కొరత కొంతమేరకు తీరుతుందన్నారు. ఈ శిబిరంలో ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులు జి.కృష్ణ, కె.లక్ష్మణ్, రెడ్‌క్రాస్ మేనేజర్ జి.రమణ, పి.చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ పిఒ నాగరాణి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంపిడిఒ రామారావు, ఎంఇఒ అప్పారావు, డాక్టర్ కల్యాణి మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యుక్త వయసు బాల, బాలికలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఎం.రాంబాబు, కో-ఆర్డినేటర్ మనో, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్‌లు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధి సమాజం భాధ్యత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బాలికల అభివృద్ధి సమాజం భాధ్యతని ఎంపిడిఒ రమేష్ నాయుడు అన్నారు. గురువారం వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ప్లస్ టూ పాఠశాలలో ఎపిఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చదువు విడిచిపెట్టిన బాలికలు మళ్లీ చదువుకునేలా తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యత తెలియజేయాలన్నారు. చదువుతో జీవితంలో ఏవిధంగా అభివృద్ధి చెందుతారో, బాలికల రక్షణకు అందుబాటులో ఉన్న చర్యలు తదితర వాటిపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల, ప్లస్ టూ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లో విద్యార్థుల సర్వే

ప్రజాశక్తి- పలాస

రైతులు పడే కష్టాలు స్వయంగా పరిశీలించేందుకు పలాస మదర్ థెరిసా విద్యార్థులు గురువారం పంట పొలాలకు వెళ్లారు. ఈ సందర్భంగా రైతుకు బాసటగా ఉండేందుకు ప్ల కార్డులు ప్రదర్శించారు. దేశానికి వెన్నుముక రైతు, రైతేరాజు అనే సందేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ వజ్జ గంగా భవాని మాట్లాడుతూ రైతు లేకుంటే అన్నానికి కూడా ఇబ్బందులు తప్పవని, అటువంటి రైతు నేడు సంక్షోభంలో ఉండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు బాసటగా అంతా నిలవాలని కోరారు.

ఉపాధ్యాయులకు రక్షణ కరువు

శ్రీకాకుళం అర్బన్: కడప జిల్లా రాయచోటిలో విద్యార్థి చేతిలో ఉపాధ్యాయుడు మరణించిన సంఘటన ఉపాధ్యాయ లోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఇటువంటి ఘటనలు బాధాకరమని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల్లో పెరుగుతున్న క్రమశిక్షణ రహిత ధోరణులకు ఈ ఘటన పరాకాష్టన్నారు. విద్యార్థుల్లో ఇటువంటి ధోరణులు పెరగడం సమాజానికి నష్టదాయకమన్నారు. ఉపాధ్యాయులకు పని ప్రదేశాల్లో రక్షణ కరువవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మితిమీరిన స్వేచ్ఛ ఇవ్వటం వల్ల ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వీటిని అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలు, సమాజం, తల్లిదండ్రులు సమిష్టి కృషి చేయాలన్నారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయుడికి అవకాశం కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఇలాంటి సంఘటన పునరావృతమవుతాయన్నారు.